క్లుప్తంగా

భక్తులకు మజ్జిగ వితరణ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవో ఎస్వీ నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా స్వామి అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎండ వేడిమికి ఉపశమనం కలిగించేలా అన్నదానం విభాగం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తునట్లు తెలిపారు. వేసవిని పురస్కరించుకుని భక్తులు ఇబ్బందులు పడకుండా పలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ వేధింపులతో వలంటీర్ రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా లేఖ అందిస్తున్న వలంటీర్ షబ్బీర్ అహ్మద్

నాగలాపురం: టీడీపీ నేతల వేధింపులతో మండలంలోని టీపీ కోట గ్రామానికి చెందిన వలంటీర్ షబ్బీర్ అహ్మద్ రాజీనామా చేశాడు. ఆయన తన రాజీనామా పత్రాన్ని సోమవారం ఎంపీడీవో పీఎంకె బాబుకు అందించారు. వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపాడు.

నాడు-నేడు పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నాడు-నేడు రెండో విడత పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం పెద్దపాలేడు గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నపాలేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా 2వ విడతలో నిర్మిస్తున్న భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాల్లో రూ.5 కోట్లతో పనులు పూర్తి అయ్యాయన్నారు. అదే విధంగా రెండవ విడత విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పథకం అమలుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల పరిశీలన



నీరువాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు హుస్సేన్ సాహెబ్

పిచ్చాటూరు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు హుస్సేన్ సాహెబ్, పీఆర్ఏఈ మణిబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నీరువాయి, వేలూరు, అడవికొడియంబేడు, మాలగుంట, వెంగళత్తూరు గ్రామాల్లోని మొత్తం 15 పోలింగ్ చెంద్రాలను పరిశీలించామన్నారు. పోలింగ్ కేంద్రాలలో వసతులపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. నిబంధనల మేరకు అన్ని వసతులు ఉన్నాయా ? అని పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



మౌనిక

ఏర్పేడు: మండలంలోని కాట్రికాయలగుంట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని మౌనిక జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు ఎంఈఓ-2 దయాకర్ సోమవారం తెలిపారు. విద్యార్థిని వలసపల్లి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు చెప్పారు. విద్యార్థిని ఎంపిక పట్ల పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బీటీరోడ్డుగా మారిన కాంపాళెం మట్టి రోడ్డు



బీటీరోడ్డుగా కనమనంబేడు రోడ్డు



గ్రామీణ రోడ్లకు మోక్షం

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. ఆ రోడ్లపై ప్రయాణం గ్రామీణ ప్రజలకు నరకప్రాయంగా ఉండేది. గత ప్రభుత్వాలు అయితే కనీసం గుంతలు పడిన రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే గ్రామీణ ప్రాంత రోడ్లకు మోక్షం లభించింది. కోట్ల రూపాయల నిధులతో రోడ్లను అభివృద్ధి చేయడంతో గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- సుమారు రూ.4 కోట్లతో 6 కిలోమీటర్లు మేర సీసీ, తారురోడ్లు
- రహదారుల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక చొరవ
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- కనీస మరమ్మతులు చేయలేకపోయిన గత ప్రభుత్వాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్నో ప్రభుత్వాలు మారినా పల్లెలకు వెళ్లే రోడ్లకు మోక్షం లభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మట్టి రోడ్లను తారు, సిమెంట్ రోడ్లుగా మార్చి, సమస్యలను పరిష్కరిస్తామని 2019 ఎన్నికల సమయంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో 72 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మట్టిదారులు బీటీ, సిమెంట్ రోడ్లుగా రూపుదిద్దుకోవడం చూసి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుక్కంబాకం, కాంపాళెం, విజయగోపాలపురం, కరకంబట్టు, పూసలపల్లి, తహానగర్ గ్రామాల్లో మట్టి రోడ్డు వల్ల విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే మట్టి రోడ్లను బీటీ, సిమెంట్ రోడ్లుగా మార్చడానికి సుమారు రూ.4 కోట్లను మంజూరు చేసింది. గ్రామాల మట్టి రోడ్డు బీటీ, సిమెంట్ రోడ్లుగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన బుచ్చినాయుడుకండ్రిగ నుంచి కనమనంబేడు గ్రామానికి వెళ్లే రోడ్డు పనులను కాంట్రాక్టరుతో మాట్లాడడంతో రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గుంతలమయమైన రోడ్లకు మోక్షం కల్పించారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– సుబ్రమణ్యం, కుక్కంబాకం గ్రామం

సమస్య తీర్చారు..



ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఆయనకు రెండు కళ్లుగా భావించి పాలన అందిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా రోడ్లకు మోక్షం కల్పించి గ్రామీణ ప్రజల సమస్యను తీర్చారు.

– గురవయ్య, కంచనపుత్తూరు గ్రామం

సంక్షేమ ప్రదాతకు ఘన స్వాగతం పలకండి

శ్రీకాళహస్తి: ఈ నెల 4వ తేదీ ఉదయం రేణిగుంట నుంచి నాయుడుపేటకు బస్సుయాత్రగా శ్రీకాళహస్తి నియోజకవర్గం గుండా వెళుతున్న సంక్షేమ ప్రదాత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలకాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులతో మాట్లాడారు. కార్యకర్తలు, ప్రజలందరూ సీఎం బస్సుయాత్రకు స్వాగతం పలకాలని కోరారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఆయా మండలాల వారీగా జగనన్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

జగనన్నను గెలిపించుకుందాం



ప్రజలతో మాట్లాడుతున్న పవిత్రారెడ్డి



శ్రీకాళహస్తి: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుని సంక్షేమ పథకాలను కొనసాగించుకుందామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి కోరారు. ఆమె సోమవారం శ్రీకాళహస్తి మండలం రెడ్డిపల్లి, గంగలపూడి పంచాయతీల్లో ప్రతి గడపకూ వెళ్లి ఎమ్మెల్యేగా తన తండ్రి బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టలేదన్నారు. దీనిని బట్టి చూస్తే ఆయన ప్రజా సంక్షేమానికి ఎంత కృషి చేస్తున్నారో తెలుస్తుందన్నారు. వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా 1వ తేదీన ఇచ్చే పింఛనును టీడీపీ వలంటీర్ల నెపంతో ఎన్నికల సంఘం చేత ఆపించిందన్నారు. దీంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారు మంచి పనులు చేయరు.... చేసే ప్రభుత్వాన్ని ఇలా ఆపించేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వృద్ధులు, వికలాంగుల ఉసురు తప్పదని తెలిపారు. కరోనా కష్టకాలంలో టీడీపీ నాయకులు ఇళ్లల్లో కూర్చుంటే.. తన తండ్రి బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజలకు ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి తన తండ్రిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు.

ఎందుకింత ద్రోహం బాబు



ఐదేళ్లుగా ప్రతి నెలా క్రమం తప్పకుండా వలంటీర్ ఉదయం 5 గంటలకు తలుపుకొట్టి పెన్షన్ ఇస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వితంతు పెన్షన్ కింద రూ.3 వేలు ఇస్తున్నారు. సోమవారం ఉదయాన్నే ఇంటికి రావాల్సిన వలంటీర్ రాలేదు. ఉదయం నుంచి 10 గంటల వరకు ఎదురుచూసినా కనిపించలేదు. ఎందుకు రాలేదని ఇరుగుపొరుగు వాళ్లను అడిగాను. చంద్రబాబు నాయుడు వలంటీర్లు పింఛన్ ఇవ్వనీయకుండా కోర్టుకు వెళ్లారని చెప్పారు. ఎన్నికలు అయ్యేంత వరకు వలంటీర్లు పెన్షన్ పంపిణీ చేయరాదని కోర్టు ఆదేశాలు ఇచ్చిందట. చంద్రబాబునాయుడు మాకు ఎందుకింత ద్రోహం చేసి, మా ఉసురుపోసుకున్నావు. భగవంతుడు చూస్తున్నాడు.. మా ఉసురు కొట్టుకుని పోతావు.

– ఆదెమ్మ, మోదుగులపాలెం, ఏర్పేడు

రూ.1500 మందులకే కావాలి



నాకు 70 ఏళ్లు, మా వలంటీరు ప్రతినెలా 1వ తేదీ తెల్లవారక ముందే పింఛను డబ్బు రూ.3 వేలు ఇంటికి తెచ్చి ఇచ్చేది. ఈ నెల 3వ తేదీ నుంచి సచివాలయంలో ఇస్తారు అని చెప్పింది. కరకంబాడి సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలి. నడవలేని స్థితిలో ఉన్నా.. నన్నెవ్వరు అక్కడికి తీసుకెళ్తారో అర్థం కావడం లేదు. పింఛను నమ్ముకుని ప్రతి నెలా 1వ తేదీన రూ.1500 పెట్టి షుగర్, బీపీకి మందులు తెప్పించుకుంటుండేదాన్ని. మందులయిపోయాయి. ఈ మూడు రోజులు ఏం చేయాలో అర్థం కావడం లేదు. చంద్రబాబు నాయుడు వలంటీర్లను వద్దని చెప్పి ఎలక్షన్ అధికారులకు ఫిర్యాదు చేయడం వల్ల మా ముసలోళ్లకు ఈ గతి పట్టింది. ఏం చేయాలి దేవుడా..?

– గురమ్మ, గొల్లపల్లి, కరకంబాడి సచివాలయం, రేణిగుంట మండలం

6 లోగా ధ్రువీకరణ పత్రాలివ్వాలి

చిల్లకూరు : చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు 6వ తేదీలోగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ప్రిన్సిపాల్ మీరా సాహెబ్ కోరారు. విద్యార్థులకు వచ్చిన ర్యాంక్‌ను బట్టి కాల్ లెటర్లు పంపించినట్టు వివరించారు. వారు ఆదాయం, కులం, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్, మూడు, నాలుగు తరగతుల టీసీ, నాలుగు ఫొటోలు అందజేయాలని సూచించారు. వివరాలకు 9441630392లో సంప్రదించాలన్నారు.

బాలింతలకు వైద్యపరీక్షలు



మహిలను పరీక్షిస్తున్న వైద్యుడు దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుని, గర్భంలోని బిడ్డ, ఆరోగ్యం పరిస్థితిని తెలుసుకోవాలని వైద్యాధికారి మాధవి, వైద్యులు దివాకర్ తెలిపారు. సోమవారం గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీలో వారు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరికి ల్యాబ్‌టెక్నీషియన్ రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తినాలని తెలిపారు. పౌష్టికాహారం తింటే ఆరోగ్యంతో పాటు బలం వస్తుందని, తద్వారా అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చన్నారు. మందులను క్రమం తప్పకుండా వాడుకోవాలని, అలాగే టీకాలను వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వేంకటేశ్వర్లు, సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అదనపు వేతనం



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు : ఉపాధి కూలీలకు వేసవిలో అదనపు కూలి ఇస్తున్నట్టు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం సీతారాంపేటలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో కూలీలకు రోజుకు రూ.272 వేతనం ఉండేదన్నారు. ఏప్రిల్ 1 నుంచి రూ.300లకు పెంచినట్లు వివరించారు. పనుల్లో కొలతలను బట్టి వేతనం వస్తుందన్నారు. రోజురోజుకూ ఎండతీవ్రత పెరుగుతోందన్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటలలోపు పనులు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పొలాల్లో పండ్లు, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, సీడీసీఎల్ఆర్పీ చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, సీనియర్ మేట్ సరిత పాల్గొన్నారు.

పీవీఆర్ కుటుంబ సభ్యులను కలిసిన ఎంపీ



ఎంపీ గురుమూర్తిని సన్మానిస్తున్న పీవీఆర్ కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం పీవీఆర్ కటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని గెలిపించడానికి సహకరించాలని కోరారు. మనసముద్రానికి పీవీఆర్ కుటుంబానికి ఎంతో సన్నిహిత సంబంధం ఉందన్నారు. పూర్వం మడుగుల స్వామిని తమ గ్రామం నుంచి పీవీఆర్ కుటుంబ శ్రీకాళహస్తికి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో పీవీఆర్ కుటుంబ సభ్యులు ప్రతాప్‌రావు పవార్, జనార్ధన్‌రావు పవార్, ముకుందరావు పవార్, శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు పీజే చంద్రయ్య, పీఎం చంద్ర, రత్నం రెడ్డి, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, కిట్టు మేస్త్రీ, జీవిరమణమూర్తి, పఠన్ ఫరీద్, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కుట్రలను గుర్తించండి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: పేదలకు మంచి జరగకుండా టీడీపీ చేస్తున్న కుట్రలను గుర్తించాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కోరారు. వారు సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలో వేర్వేరుగా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. పేదలకు మంచి జరుగకూడదన్న ఉద్దేశంతోనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగా వృద్ధులు, వికలాంగులకు ఒకటో తేదీనే పింఛన్లు అందకుండా చేశారని విమర్శించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని, ఎంపీగా తనను గెలిపించాలని గురుమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, జనార్ధన్ పవార్, రత్నంరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పఠాన్‌ఫరీద్, కిట్టుమేస్త్రీ, దాసురెడ్డి, మధురెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంచేస్తున్న ఎంపీ గురుమూర్తి

పేదల సంక్షేమం కోసం జగనన్నే రావాలి



దొడ్లమిట్టలో ప్రచారం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట : సంక్షేమ పథకాలు కొనసాగి పేదరిక నిర్మూలన జరగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి తెలిపారు. ఆమె సోమవారం సాయంత్రం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట, ఎస్టీ కాలనీలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. సొంత నిధులతో ముస్లింలకు మేనమామ సాంగ్యం, పేదల ఇళ్లలో ఎవరైనా మృతి చెందితే రూ.10 వేలు తక్షణ సాయం, వందలాది మంది పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం, పేద చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు ఇలా చాలా కార్యక్రమాలను చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, మన్యం శ్రీనివాసులురెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రకాష్, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ శ్రావణి, సుబ్రమణ్యం, వెంకటయ్య, త్యాగరాజులు, సురేంద్ర, గణేష్, గోవర్ధన్, యోగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ శశికిరణ్, ఆనందరావు, గిరిరెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జాన్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు హసన్, నగేషం, మునిశేఖర్‌రెడ్డి, పైపుల రమేష్, వేణు, నగరి కృష్ణ, అరుణాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు అందజేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని నగరవీధిలో గల హెల్పింగ్ హ్యాండ్స్ కార్యాలయంలో సోమవారం పేదలు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అదే విధంగా మహిళలకు 200 చీరలను, హెల్పింగ్ హ్యాండ్స్‌లో పనిచేస్తున్న వారికి రంజాన్ పండుగను పురస్కరించుకుని కుటుంబానికి కావాల్సిన పట్టువస్త్రాలు, పండుగ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో బాబా ఫరీద్, మునీర్ బాషా, రాజేశ్వరరావు, సుజాత, జితేంద్ర తదితరుల పాల్గొన్నారు.

14 నుంచి అగస్తీశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సోమవారం తెలిపారు. 13న సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు గణపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహిస్తారు. ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్తీశ్వరస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజూ ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రోజూ రాత్రి 7 గంటలకు స్వామివారి వాహనసేవ ఉంటుంది. 15న సింహ వాహనం, 16న హంస వాహనం, 17న శేష వాహనం, 18న నంది వాహనం, 19న గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 20న రథోత్సవం కనులపండువగా జరుగనుంది. ఏప్రిల్ 21న రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, అనంతరం అశ్వవాహన సేవ జరుగనున్నాయి. రూ.500 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, అప్పం, అన్నప్రసాదాలను బహుమానంగా అందజేస్తారు. 22న ఉదయం 9 గంటలకు శ్రీ నటరాజస్వామివారి వీధి ఉత్సవం జరుగనుంది. రాత్రి 7 గంటలకు రావణేశ్వర వాహనంపై అగస్తీశ్వరస్వామి దర్శనమిస్తారు. 23న కైలాసకోనలో త్రిశూలస్నానం ఘనంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రోజూ కోలాటం, ఆధ్యాత్మిక, భక్తిసంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర..

నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాల నుంచి తెలుస్తోంది. ఇక్కడ శ్రీ అగస్తీశ్వరస్వామివారు స్వయంభుగా వెలిశారు. స్వామివారి లింగాకారానికి పీఠభాగం అనగా బాణపట్టమును అమర్చి వేద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీ అగస్త్య మహర్షులవారు ప్రతిష్ట చేసి పూజించడం వల్ల స్వామివారికి అగస్తీశ్వరస్వామి అని పేరు వచ్చింది.